క్లుప్తంగా

శిల్పారామంలో ఆటా-పాట



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్: ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో అఖిల్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు శాస్త్రీయ, నృత్యాలు, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో సందర్శకులను అలరించారు. గొబ్బియాలో, రాసురాను బొంబాయికి, వన్నెలాడే టిక్కులాడే పాటలకు చిన్నారుల నృత్యాలు అందరిచే వన్స్‌మోర్ అనిపించాయి. శిల్పారామం పాలనాధికారి కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

భవన నిర్మాణానికి చర్యలు తీసుకోండి


హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

కడప అర్బన్: జిల్లా కోర్టు ఆవరణలోని క్రిమినల్ కోర్టుల నిర్మాణానికి, న్యాయవాదుల సంఘం భవనం పైఅంతస్తు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి కోరారు. జ్యుడిషియల్ కాన్ఫరెన్స్ కార్యక్రమాలకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ వీవీఎల్ఎన్.చక్రవర్తిలను న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఆదివారం స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలు విన్నవించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధురాలు పద్మావతి


అన్నదానం చేస్తున్న రామచంద్రయ్య

కడప కార్పొరేషన్: మాజీ కార్పొరేటర్ బోలా పద్మావతి అలుపెరుగని పోరాట యోధురాలు అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ.రామచంద్రయ్య అన్నారు. బోలా పద్మావతి వర్ధంతి సందర్భంగా శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఆమె నిరంతర పోరాటం చేశారని తెలిపారు. వైఎస్సార్ కుటుంబం అండతో మూడు సార్లు కౌన్సిలర్‌గా, ఇన్‌చార్జి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, కార్పొరేటర్‌గా ఆమె ప్రజలకు సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో బోలా జయరామ, వెంకట చక్రధర్, తనూజా,వెంకట జగన్నాథ్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

భద్రతా నియమాలపై సదస్సు


ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ జావిద్

కడప ఎడ్యుకేషన్: రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావిద్ పేర్కొన్నారు. కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం రహదారి భద్రతా నియమాలపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జావిద్ మాట్లాడుతూ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, రహదారి సూచికలు, నియమాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, తమ చుట్టూ ఉన్న వారికి రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్‌జే.ఆత్రే, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్. డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్, అనిల్‌కుమార్, రూపేంద్రజిత్‌సింగ్, సీఎల్.రెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే ధార్మిక చింతన


పుస్తకాలతో విద్యార్థులు, తదితరులు

కడప ఎడ్యుకేషన్: బాల్యం నుంచే విద్యార్థులకు ధార్మిక చింతనతోపాటు మానవతా విలువలు నేర్పించాలని కడప జిల్లా అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ శాఖ అధ్యక్షుడు సత్తార్ ఫైజి అన్నారు. కడప నగరం నబీకోట మదరసా ఎ ఫైజానె మహబూబె సుబ్హానిలో ఆదివారం వేసవి శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మత గురువు మహబూబ్‌ఖాన్ యూసుఫ్ ఆధ్యాత్మిక పుస్తకాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్ జమాఅత్ అబు ముబారక్, హాఫిజె ఖురాన్ మహమ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

లాంగ్ మార్చ్‌కు తరలిన జనం


నినదిస్తున్న ముస్లింల నాయకుడు


విశేషంగా తరలివచ్చిన జనం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన లాంగ్‌మార్చ్‌కు వందలాది జనం తరలివచ్చారు. ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజలనుంచి అద్భుత స్పందన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ముస్లిం, మైనార్టీలు, యువత, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నినదించారు. నగరంలోని రహదారులు కిక్కిరిసి పోయాయి. వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప


జాతీయ జెండాలతో ముస్లింలు

మే 20న దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావం


మాట్లాడుతున్న తిరుపతయ్య

కడప కల్చరల్: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. కడప ఎస్ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద శాతం ఎఫ్‌డీఐ పేరుతో దేశంలోకి విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించ బోతున్నారన్నారు. కొందరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలకు తలొగ్గి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాయని అన్నారు. పదవీ విరమణచేసిన వారి సంఖ్య పెరిగి కార్యాలయాల్లో పని భారం పెరుగుతోందని, నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు అవధానం శ్రీనివాస్, రఘునాథరెడ్డి, కామనూరు శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీరాజా, లలిత, అజీజ్, జగదీశ్వరరెడ్డి, రామాంజులరెడ్డి, లక్ష్మీదేవి, కంభం చెన్నయ్య, రామకష్టారెడ్డి, దస్తగిరిరెడ్డి, చంద్రపాల్, సుధీకర్, తదితరులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌బాషా, వసుప్రద, వారిజాతమ్మ, కేసీఎస్.రాజు, జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కడప అగ్రికల్చర్: అసంఘటిత, వ్యవసాయ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచన మేరకు.. కడప రైతు బజార్‌లో వ్యవసాయ, మత్స్య కార్మికులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ చట్టపరమైన సాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, ఈ-శ్రమ్ కార్డులపైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. అసంఘటిత, వ్యవసాయ కార్మికుల సమస్యలను గుర్తించి, తగు న్యాయ సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

- అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ్
- అవగాహన కల్పించిన అంగన్వాడీలు

కడప కోటిరెడ్డిసర్కిల్: పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల పర్యవేక్షణ, పౌష్టికాహారం, మందులు అందించి సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా పోషణ పక్వాడ్‌ను ప్రభుత్వం చేపట్టింది. గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా ఆరోగ్యాంధ్ర సాధించాలన్నదే దీని లక్ష్యం. జిల్లా వ్యాప్తంగా మార్చి 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ పోషకాహార పక్షోత్సవాలు జరిపారు. ఇందులో గర్భిణుల బరువు పరిశీలించడం, అవసరమైతే వైద్య పరీక్షలు చేయించడం చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు వివరించారు. పోషకాహార పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా అందరికీ అవగాహన కల్పించడం, అలాగే మొదటి వేయి రోజులపై దృష్టి సారించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టడం చేశారు.

లబ్ధిదారుల గృహ సందర్శన

అంగన్వాడీల్లో లబ్ధిదారుల గృహాలను కార్యకర్తలతో పాటు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు సందర్శించడం, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కౌమార బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం, పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించి అదనపు పోషకాలు అందించేలా చర్యలు చేపట్టారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం, గర్భిణులు, బాలింతలకు కౌన్సెలింగ్ ఇవ్వడం, బలవర్థకమైన ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో తెలియజేయడం, అంగన్వాడీ కేంద్రాల్లో సీమంతాలు, అక్షరాభ్యాసాలు చేయించడం వంటి వాటిని చేపట్టారు.

పోషణ పక్వాడ్‌లో కార్యక్రమాలిలా..

- గర్భిణుల పర్యవేక్షణ. రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సుగల పిల్లల పెరుగుదల గుర్తించడం, తల్లిపాలు అందించడం. అనుబంధ పోషకాహార పద్ధతులపై బాలింతలకు వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇవ్వడం చేశారు.
- మొదటి ఆరు నెలల బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంపై అవగాహన, శిశువుల్లో ఇన్‌ఫెక్షన్ నివారించేందుకు చేతులు కడుక్కోవడం నేర్పించారు.
- చిరుధాన్యాలతో పరిపూర్ణమైన ఆహార వంటకాలపై అవగాహన కల్పించడం, బాలింతలు, కౌమార బాలికలు, గర్భిణుల సంరక్షకులతో గ్రూప్ కార్యక్రమాలు. లబ్ధిదారుల మాడ్యూల్ ద్వారా తల్లుల ఆరోగ్య స్థితి తెలుసుకోవడం చేశారు.
- ఇంటిలో పోషకాహార లోపం ఉన్న పిల్లలకు అధిక శక్తినిచ్చే ఆహార పదార్థాల వంటల ప్రదర్శన. చౌకగా లభించే ఆహార పదార్థాలను ప్రోత్సహించడం వంటివి చేశారు.
- బాలికల కోసం ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంపై పోస్టర్ నినాదాల పోటీలు నిర్వహించడం వంటి వాటిని నిర్వహించారు.

పోషకాహారంపై అవగాహన

చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం లేకుండా పోషణ పక్వాడ్ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా జీవితంలో కీలకమైన మొదటి వేయి రోజులపై దృష్టి సారించేందుకు ఈ నెల 22వతేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులను చైతన్యవంతులను చేశాం.

– దేవిరెడ్డి శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, కడప

వినూత్న కార్యక్రమాలు

అధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ్‌లో భాగంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టి చిన్నారులతోపాటు తల్లిదండ్రులను కార్యక్రమంలో భాగస్వాములను చేయడం జరిగింది. వైద్య సిబ్బందితో గర్భిణులకు పరీక్షలు నిర్వహించడం, పోషకాహారం లోపం ఉన్న చిన్నారులను గుర్తించి పోషకాహారం అందించేందుకు చర్యలు చేపట్టాం.

– శోభారాణి, సీడీపీఓ, ఐసీడీఎస్, కడప

శాస్త్రీయ దృక్పథంపై సదస్సు

కడప ఎడ్యుకేషన్: కడప ద్వారకానగర్‌లోని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో ఆదివారం శాస్త్రీయ దృక్పథంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. గాయకులు వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా కొన్ని గీతాలు సభ్యులతో పాడించారు, మెజీషియన్ బాలబయన్న మ్యాజిక్ చిట్కాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సునీత, అరుణమ్మ, కామేశ్వరమ్మ, వెంకట రామరాజు, అబ్దుల్ రాయల్ కరీ ముల్లా, కుమార్‌స్వామిరెడ్డి పాల్గొన్నారు

7న ప్రతిభా పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన కడప జిల్లా పట్ర కులం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందివ్వనున్నట్లు వీరగురుడు ఫౌండేషన్ నిర్వాహకుడు తిప్పన బ్రహ్మయ్య తెలిపారు. ఈ నెల 7న కడప జన చైతన్య సంఘం కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు జరిగే కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో 950 మార్కులకు పైగా వచ్చిన పట్ర కులం విద్యార్థులకు నగదు, మెమెంటోలు అందజేస్తామన్నారు. విద్యార్థులు తమ మార్కుల జాబితా, చిరునామా, ఫోన్ నెంబర్ 6303600328కు వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు.

పది విద్యార్థులకు సన్మానం

కడప ఎడ్యుకేషన్: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్స్‌గా నిలిచిన పది మంది విద్యార్థులు, వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సోమవారం సన్మానిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. కడప శిల్పారామంలోని ఓపెన్ ఆడిటోరియంలో సాయంత్రం నాలుగు గంటలకు సన్మాన కార్యక్రమం ఉటుందని, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అతిథిగా హాజరుకానున్నట్లు డీఈఓ తెలిపారు. జిల్లాలోని ఎంఈఓలు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

టిప్పు సుల్తాన్‌కు ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్: కడప గౌస్ నగర్‌లోని జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వారి కార్యాలయంలో టిప్పు సుల్తాన్‌కు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఆ సంస్థ అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ బ్రిటీష్ వారిని గడగడలాడించిన టిప్పు సుల్తాన్ రాజ్యంలో బేధాభిప్రాయాలు లేకుండా అందరినీ సమానంగా చూశారన్నారు. యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ అమానుల్లా, నారాయణ, హైదర్, తదితరులు పాల్గొన్నారు.

గుంత తవ్వారు.. అక్రమ రవాణాను అడ్డుకున్నారు


టక్కోలు గ్రామం నుంచి పెన్నా నదికి వెళ్లే దారిలో గ్రామస్తులు తీసిన గుంత

సిద్దవటం : మండలంలోని టక్కోలు, డేగనవాండ్లపల్లె గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఆదివారం స్థానికులు రహదారికి అడ్డంగా గోతులు తీశారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పెన్నానది నుంచి తరచూ అక్రమ ఇసుక రవాణా చేస్తున్న అక్రమార్కులు వేల రూపాయలు సంపాదిస్తున్నారని, గ్రామస్తులు ఇసుక అక్రమ రవాణా జరగకుండా వాహనాలు పెన్నానదిలోకి వెళ్లే రహదారిలో జేసీబీ యంత్రంతో గోతులు తీశారు. ఇక్కడి పెన్నానది నుంచి తరచూ ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడమే గాకుండా తమ భూములు వరదల సమయంలో కోతకు గురవుతున్నాయని రైతులు మండిపడ్డారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుంటే ఇలానే ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే తమ పంట పొలాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విస్తరణ జరగదు.. సమస్య తీరదు


భాకరాపేట కూడలి వద్ద నిలిచిన వాహనాలు

సిద్దవటం : మండలంలోని కడప – చెన్నై జాతీయ ప్రధాన రహదారిలో తరచూ వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. సిద్దవటం మండలంలోని భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో తరచూ భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య నెలకొందని ప్రయాణికులు అంటున్నారు. కడప – తిరుపతి వైపు హైవే రహదారిపై ప్రతి రోజు వందల వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. బద్వేల్ ప్రాంతం నుంచి వాహనాలు వస్తుండటంతో ఆదివారం భాకరాపేట కూడలిలో ఒక్కసారిగా వాహనాల రద్దీ నెలకొంది. దాదాపు 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తరచూ హైవే రహదారిపై భారీ వాహనాలు వస్తుండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయని ట్రాఫిక్ సమస్య లేకుండా నేషనల్ గ్రీన్ హైవే పనులను ప్రభుత్వం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని రెవల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమణయ్య డిమాండ్ చేశారు. కడప రవీంద్రనగర్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిలో రెండోసారి శంకుస్థాపన చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు, విభజన హామీలను నెరవేర్చడం లేదన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు, కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొడవటికంటి నాగరాజు, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట గంగమ్మకు ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు, వేపాకు, నిమ్మకాయలు, పూలదండలు, తోమాలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ సమీపంలోని వీరభద్ర స్వామి, శివాలయం దేవాలయంలో పూజలు చేశారు.

మధుర ఫలం.. విషతుల్యం

- పండ్లను మాగబెట్టేందుకు రసాయనాల వినియోగం
- ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కెమికల్స్
- రైపనింగ్ చాంబర్ల ఏర్పాటు పట్ల ఆసక్తి చూపని రైతులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడిపండ్లు


మాగబెట్టిన అరటి కాయలు

రాయచోటి జగదాంబ సెంటర్ : ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యం కలదు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగిన నేపథ్యంలో రోజువారీ ఆహారంలో జామ, బొప్పాయి, దానిమ్మ, కమలా తదితర పండ్లను తీసుకుంటున్నారు. వైద్యులు, న్యూట్రిషియన్లు సైతం పండ్లు, గింజల నానబెట్టిన సీడ్స్‌ను తినండంటూ అవగాహన సైతం కల్పిస్తున్నారు. శాఖాహారం తీసుకునేవారు రోజు మొత్తంలో పండ్లను ఎక్కువగా భుజిస్తారు. తినే పండ్లలో ఆరోగ్యశాతమెంతన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తుంది. అరటి, మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్లో పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ తదితర రసాయనాలను వినియోగిస్తుండటంతో ఫలాలు విషతుల్యమవుతున్నాయి. పోషకాలతో పాటు విషపదార్థాలు శరీరంలోకి వెళ్లడం ద్వారా ఆరోగ్యం దెబ్బతింటోంది. ఈ విషయమై జిల్లా స్థాయిలో ఇటీవలే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పండ్ల వ్యాపారస్తులతో సమావేశమై పలు సూచనలు, సలహాలను చేశారు.

రసాయనాల వినియోగం ఇలా..

ఉత్పత్తి అయిన వ్యవసాయ క్షేత్రం నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో మార్కెట్ కీలకమైనది. పండు చెట్టు మీదనే పరిపక్వతకు వచ్చాక తినడమనేది దాదాపు సాధ్యం కాదు. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకృతి సిద్ధంగా మాగబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంది. అయితే సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. మామిడి పండ్లకు కాల్షియం కార్బైడ్, అరటికి ఇథెఫాన్ లిక్విడ్‌లను స్ప్రే చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మార్కెట్‌కు, రైతుకు మధ్య ఉన్న దళారీలే చేస్తున్నారు.

సహజసిద్ధంగా పండిన పండును గుర్తించండి ఇలా..

సహజ సిద్ధంగా మాగిన మామిడిపండ్లు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని వాసనను మనం దూరంగా ఉన్నప్పటికీ గ్రహించగలుగుతాం. సహజసిద్ధమైన తీపి ఎక్కువగా ఉంటుంది. రసాయనాలతో మాగించిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటుంది. పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కు దగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తక్కువ తీపి ఉంటుంది.

విజిలెన్స్ దాడులు

పండ్లను రసాయనాలతో మాగబెట్టి అమ్మడంపై విజిలెన్స్ శాఖ దాడులు నిర్వహించి కేసులను నమోదు చేస్తుంది. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానశాఖాధికారులు నిర్ధారించగా సంబంధిత అధికారులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారు. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన రైపనింగ్ చాంబర్లలో పండ్లను మాగబెట్టి విక్రయించడం మేలు.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



కాల్షియం కార్బైడ్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దాంతో మగ్గబెట్టిన పండ్లు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలొస్తాయి. రోజూ పండ్లు తినేవారు సహజసిద్ధంగా పండించిన పండ్లు తినడం మేలు. ప్రత్యామ్నాయంగా ఎథిలిన్ హార్మోన్ స్ప్రే చేయొచ్చు. రైపనింగ్ సెంటర్లు ప్రయోజనకరంగా ఉంటాయి.

– వనిత బాయి, ఉద్యానవన శాఖాధికారి, రాయచోటి